26 రోజులు.. 30వేల దరఖాస్తులు

- సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు
- ఎప్పటికప్పుడు డాటా ఎంట్రీ
- పర్యవేక్షిస్తున్న అధికారులు


డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు


సంక్షేమ పథకాల వారీగా దరఖాస్తు ఫారాలను వేరు చేస్తున్న సిబ్బంది

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కోసం నగరవాసులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రేషన్‌కార్డులో అదనపు పేర్ల నమోదు, గ్యాస్ సబ్సిడీ, ఆసరా పింఛన్లు తదితర వాటి కోసం ఇప్పటి వరకు 30 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణకు బల్దియా కార్యాలయంలో అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నాయి.

కుప్పలు తెప్పలుగా..

సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులకు చివరి తేదీ అంటు లేకపోవడంతో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో బల్దియా కార్యాలయానికి దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. జనవరి 18 నుంచి ఇప్పటివరకు సుమారు 30 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి.

వీటిలో 10 వేల వరకు ఇందిరమ్మ ఇళ్లు, 15 వేలు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా.. మిగతావి రూ.500 గ్యాస్‌సబ్సిడీ, ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తు ఫారాలను అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు డివిజన్ల వారీగా వేరుచేస్తున్నారు. నిత్యం అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడంతో వాటిని వేరుచేసేందుకు ఆపరేటర్లు, సిబ్బంది ఆపసోపాలు పడుతున్నారు.

డివిజన్ల వారీగా..

బల్దియా కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను వేరుచేసే ప్రక్రియను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు అధికారి చిదుర రమేశ్ ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నుంచి కార్పొరేషన్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు 60 డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులను వేరు చేసి డాటా ఎంట్రీ చేస్తున్నారు.

డాటా ఎంట్రీ చేస్తున్నాం



సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులు ప్రతి రోజు దరఖాస్తు చేసుకుంటున్నారు. వారికోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుఫారాలను డివిజన్‌ల వారీగా వేరుచేశాం. దరఖాస్తుదారుల వివరాలను వెంటనే కంప్యూటర్‌లో నమోదు చేయాలని కమిషనర్ దిలీప్‌కుమార్ ఆదేశించారు. దీంతో ఎప్పటికప్పుడు కంప్యూటర్ ఆపరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో దరఖాస్తుఫారాల వివరాలను ఎక్సెల్ షీట్‌లో నమోదు చేయిస్తున్నాం.

– చిదుర రమేశ్, మున్సిపల్ ప్రాజెక్టు అధికారి

గురుకుల విద్యార్థుల స్టడీ టూర్


రామప్ప ఆలయం ఎదుట విద్యార్థులు, ఉపాధ్యాయులు

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు అధ్యయన యాత్రకు వెళ్లారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప ఆలయం, భద్రకాళి ఆలయం, వరంగల్ కోట, పలు ఆధ్యాత్మిక, విజ్ఞాన స్థలాలను సందర్శించారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పీఎం శ్రీ పథకానికి ఎంపికైన విషయం తెలిసిందే. విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు స్టడీ టూర్ ఎంతగానో దోహదపడుతుందని వైస్ ప్రిన్సిపాల్ సునీత పేర్కొన్నారు. అధ్యయన యాత్రకు తరలివెళ్లిన వారిలో 350 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఈద్గాలను పరిశీలించిన కమిషనర్



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ బుధవారం జిల్లాకేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. నగరంలోని ఈద్గాలను పరిశీలించారు. జగ్‌నేకా రాత్ సందర్భంగా పలు ఈద్గాలలో ప్రార్థనలకు అనుకూలంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. పలు డివిజన్లలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంహెచ్‌వో జయకుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సాజిద్‌అలీ, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- ఎస్బీఐ రీజినల్ మేనేజర్ కోలేటి మహేశ్వర్


ఉచిత శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులతో ఎస్బీఐ ఆర్‌ఎం మహేశ్వర్, సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్

డిచ్‌పల్లి: ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ)లో నేర్చుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఎస్బీఐ రీజినల్ మేనేజర్(ఆర్‌బీవో) కోలేటి మహేశ్వర్ సూచించారు. డిచ్‌పల్లిలోని ఆర్‌ఎస్‌ఈటీఐ ని బుధవారం సందర్శించారు. మగ్గం వర్క్, బ్యూటీపార్లర్ కోర్సులలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుత కాలంలో మగ్గం వర్క్, బ్యూటీషియన్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఇవే కోర్సులను ప్రైవేట్‌లో నేర్చుకుంటే వేలాది రూపాయలు చెల్లించాల్సి వస్తుందని, ఆర్‌ఎస్‌ఈటీఐలో పూర్తిగా ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తూ శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత స్వయం ఉపాధితో వ్యాపారాన్ని పెంపొందించుకునే మెళకువలను నేర్పిస్తారని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారు సొంతంగా షాప్ పెట్టుకోవాలనుకుంటే ఎస్బీఐ ద్వారా రుణ సహాయం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్యూటీషియన్ విద్యార్థినులు వివిధ రకాల వేషధారణ, డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. వారికి ఆర్‌ఎం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, ఈశ్వరి, సుజాత, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



ధర్పల్లి/ జక్రాన్‌పల్లి: ధర్పల్లి మండలం దుబ్బాకలోని నల్లగుట్ట నృసింహస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన ఉత్సవాలకు ఎమ్మెల్యే దంపతులు హాజరై స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పోతన్న, గోస్కొండ అశోక్, నర్సయ్య, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాక్‌లో ఉన్న లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన జాతరలో ఎమ్మెల్యే పల్లకిని మోశారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పేదలకు ఉపయోగం లేని కేంద్ర బడ్జెట్



నిజామాబాద్ సిటీ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులు, పేదలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని సీపీఎం నాయకులు మండిపడ్డారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను నిర్వహించే పేదలకు, వ్యవసాయ కూలీలకు నిధులను, జిల్లాకు కేటాయించిన జాతీయ పసుపు బోర్డుకు నిధులు కేటాయించలేదన్నారు. జిల్లాలో ఈనెల 16 నుంచి 25 వరకు సదస్సులు, చర్చాగోష్ఠులు, సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పెద్ది వెంకట్ రాములు, జంగం గంగాధర్ పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌తో రవాణాశాఖ అంశాలపై చర్చ



నిజామాబాద్ సిటీ: పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌ను ఆర్టీఏ సభ్యుడు రాజనరేందర్ గౌడ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణాశాఖకు సంబంధించిన పలు అంశాలు చర్చించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంతోష్, బొబ్బిలి రామకృష్ణ, ప్రీతం తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు


ఉమామహేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే


గజమాలతో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నేతలు


క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే


దుబాయిలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్/ నిజామాబాద్‌రూరల్/ సిరికొండ/ ధర్పల్లి: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో ఉన్న ఉమా మహేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు స్వామి వారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, ఏఎంసీ వైస్ చైర్మన్ జంగిటి రాంచందర్, కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ బోర్గాం శ్రీనివాస్, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ కిశోర్ ఇనానీ, లాభిశెట్టి శ్రీనివాస్, మారుతి మల్లేశ్, మాస్టర్ శంకర్, సొసైటీ చైర్మన్లు గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులు సాయిరెడ్డి, అమృతాపూర్ గంగాధర్, నవీన్ గౌడ్, భోజన్న, గాంధారి విఠల్‌రెడ్డి, గంగాప్రసాద్, ప్రతాప్, గుత్ప రఘు, సుభాష్, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదిన వేడుకల ను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్‌నాయకులు గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, అమృతపూర్ గంగాధర్, కంచెట్టి గంగాధర్, వాసు, లింగం, నాయకులు పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శివకుమార్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదినం సందర్భంగా దుబాయిలో కేక్‌కట్ చేశారు. సారంగపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. శాస్త్రినగర్‌లో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోర్వ రాజేంద్రప్రసాద్, కుమార్‌రెడ్డి, రాజలింగం, శ్రీధర్, తిరుమనపల్లి మోహన్, రమేశ్, మల్లారం చిరంజీవి, మల్కాపూర్ శ్రీను, జలాల్‌పూర్ రాంరెడ్డి, సాయిబాబా, సురేశ్, గాంధీనగర్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో నిర్వహించిన ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆసిఫ్, దేగాం సాయన్న, గ్యామ శోభన్, దిగంబర్, రొండ్ల గోవర్ధన్‌రెడ్డి, బడాల మహిపాల్, పెద్దన్న, రాజేందర్ గౌడ్, రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాజారెడ్డి, రవినాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు హాజరయ్యారు. ముందుగా ధర్పల్లిలోని పెద్దమ్మ ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి గంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, ఆర్మూర్ బాలరాజ్, నర్సయ్య పాల్గొన్నారు.


సిరికొండ మండల కేంద్రంలో..


ధర్పల్లిలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,300	వెండి(కిలో)	99,500
22 క్యారెట్స్	81,492	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	80	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	60	100
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	తండేల్(తెలుగు)-11.00 1.45 4.40 7.35 10.30
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-1.30, 7.30
స్క్రీన్-3	పట్టుదల(తెలుగు)-11.00,1.40, 4.30, 7.20, 10.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	పట్టుదల(తెలుగు)-10.05,1.15, 4.25,7.35,10.45
స్క్రీన్-3	స్కై ఫోర్స్(హిందీ)-10.15 డాకు మహారాజ(తెలుగు)-1.00, 7.20 దేవా(హిందీ)-4.05, 10.25
స్క్రీన్ -4	దేవా(హిందీ)-10.00, 7.10 స్కై ఫోర్స్(హిందీ)-1.15, 10.25 మదగజరాజ(తెలుగు)-4.00
లలితామహల్	తండేల్(తెలుగు)
దేవి	పట్టుదల (తెలుగు)
నటరాజ్	బాదాస్స్ రవికుమార్(హిందీ)-
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

క్లుప్తంగా

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి



నిజామాబాద్‌అర్బన్: విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలని డాక్టర్ వినయ్ ధన్‌పాల్ అన్నారు. స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో భారత్ బహుమతుల ప్రధాన కార్యక్రమాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లావణ్ జీ, రెంజర్ల నరేశ్, రాజ్ సాగర్, శశి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ శిరోమణి రవిదాస్ జయంతి



సుభాష్‌నగర్: నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో భారతీయ జనతా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సంత్ శిరోమణి గురు రవిదాస్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. సంత్ రవిదాస్ జీవితం అనేకమందికి స్ఫూర్తిదాయకమన్నారు. మత మార్పిడులకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. 500 ఏళ్ల క్రితమే అంటరానితనాన్ని రూపుమాపాలని అనేక ప్రవచనాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కెప్టెన్ రాజు, బాలకృష్ణ, సంజీవ్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే పాఠశాలలను బలోపేతం చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో వెనిగళ్ల సురేశ్, విజయ్ కుమార్, అరవింద్, రమేశ్, గంగాధర్, పోషన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



సిరికొండ: మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి గ్యామ శోభన్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం, ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దిగంబర్, ఆసిఫ్, మల్లేశ్ యాదవ్, ముషీర్, రాజేందర్‌గౌడ్, రాజేశ్వర్, ప్రసాద్, శాంతం, రామస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఎన్‌ఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. పాఠశాల విద్యలో 5, 8 తరగతులకు డిటెన్షన్ విధానం రద్దు చేయాలని, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడాలన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మమత, నాగేశ్, నసీర్, సజన్, సునీల్, అరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయాల్లో పూజలు.. అన్నదానాలు



నిజామాబాద్ రూరల్: మాఘపౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బొడ్డెమ్మ చెరువు సమీపంలో ఉన్న మహాగణపతి ఆలయంలో భక్తులు విఘ్నేశ్వరునికి అభిషేకం, అర్చనలు, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాల్‌కల్ రోడ్‌లో ఉన్న కోదండ రామాలయంలో భక్తులకు అన్నదానం చేశారు. నాగారంలోని జంబిగుట్ట భవాని ఆలయంలో యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సరస్వతి మాత ఆలయంలో ఉత్సవాలు



సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్‌లో ఉన్న సరస్వతి మాత ఆలయంలో వార్షిక ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో..



సిరికొండ: మండలంలోని మైలారంలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో దేవేరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

రాజరాజేశ్వర స్వామి ఆలయంలో..



సిరికొండ: మండలంలోని రావుట్లలో గాడిమాకుల రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రతి ఏటా ఈ ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయంలో శివ లింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం కన్నుల పండువగా సాగింది.